నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 1 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాయకులు

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మంచిర్యాల జిల్లా నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రాజకీయ పరిస్థితుల గురించి ఆయనతో చర్చించారు. రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు, మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట మాజీ మున్సిపల్ చైర్మన్లు పెంట రాజయ్య, ఈసంపెల్లి ప్రభాకర్, నల్లాసు కాంతయ్య ఉన్నారు. *- మంచిర్యాల అర్బన్, జనవరి 30*

చెన్నూర్ మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ అర్చనా గిల్డాను సన్మానిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో మాజీ విప్ బాల్క సుమన్

ఘన సన్మానం

మంచిర్యాలటౌన్/లక్షెట్టిపేట/చెన్నూర్ రూరల్, జనవరి 31: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభకు మంచిర్యాల జిల్లాకు చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్‌లు తరలివెళ్లారు. మున్సిపాలిటీల పాలక వర్గాల పదవీ కాలం ముగిసిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, లక్షెట్టిపేట మాజీ చైర్మన్ నలుమాసు కాంతయ్య, మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, నస్పూరు మున్సిపల్ మాజీ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, చెన్నూర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌ను రాంలాల్ అర్చనా గిల్డా, మాజీ వైస్ చైర్మణ్ నవాజ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ విప్ బాల్క సుమన్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజిత్ బాబు పాల్గొన్నారు.

మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్యను సన్మానిస్తూ..

లక్షెట్టిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కాంతయ్యకు సన్మానం

నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌కు సన్మానం

గుడిపేట పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కార్పొరేషన్ వద్దు.. జీవనే ముద్దు!

మాకు చెప్పకుండా ఊరిని కార్పొరేషన్‌లో ఎట్లా కలుపుతరు?

- ఉపాధి హామీ పథకం లేకుండా బతికేదెట్లా..
- గుడిపేటకు చెందిన మహిళల ఆవేదన
- పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన
- మొన్నటికి మొన్న నర్సింగాపూర్ గ్రామంలోనూ ఇదే తరహా ఘటన
- ఉపాధితో పాటు ఆత్మీయ భరోసాకు దూరమవుతున్న ఆయా గ్రామాల కూలీలు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ జీవోలు తీసుకురావడంపై జిల్లా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మొన్నటికి మొన్న ఇండస్ట్రియల్ హబ్ పేరిట దళిత రైతులను బెదిరించి భూములు గుంజుకునేందుకు సంతకాల సేకరణ చేపట్టగా, ఈ విషయం కాస్త బయటికి రావడంతో మరోసారి రైతులందరినీ పిలిపించి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ వివాదం కొనసాగుతూనే ఉండగా, మరోవైపు మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను అందులో విలీనం చేశారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. పది రోజుల క్రితం నర్సింగాపూర్ గ్రామస్తులు మా ఊరును కార్పొరేషన్‌లో కలపొద్దంటూ జాతీయ రహదారి-63పై బైఠాయించి రాస్తారోకో చేశారు. ప్రజాపాలన గ్రామసభలోనూ ఈ విషయమై అధికారులను నిలదీశారు. తాజాగా.. శుక్రవారం గుడిపేట గ్రామంలోని మహిళలు, ఉపాధి హామీ కూలీలు పంచాయతీ కార్యాలయానికి వచ్చి మా గ్రామాన్ని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ నిరసనకు దిగారు. దీంతో ఈ వ్యవహారం కాస్త ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

> **"మేమంతా ఉపాధి పనులు చేసుకునే టోళ్లం. పక్కనున్న ఊరికి ఎవుసం పనులకు కూడా పోతం. మా అభిప్రాయం తీసుకోకుండానే ఊరిని కార్పొరేషన్‌లో కలిపేసిన్రు. ఇకనుంచి ఉపాధి పథకం ఉండదంటున్నరు. ఇగ ఏం పనులు చేసుకొని బతకమంటారో చెప్పండి. రేపొచ్చి ఇంటి, నల్లా పన్నులు కట్టమంటే ఎక్కడికి పొమ్మంటరు. గిందుకేనా మిమ్ముల ఓట్లేసి గెలిపించింది. ఇకనైనా మా బాధను పట్టించుకోవాలె. మాకు కార్పొరేషన్ వద్దే వద్దు.. గ్రామ పంచాయతీయే కావాలి' అంటూ గుడిపేటకు చెందిన మహిళలు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఇటీవల నర్సింగాపూర్ గ్రామంలోనూ ఇదే తరహా నిరసన చేపట్టిన విషయం విదితమే.**

ఉపాధి హామీతో పాటు ఆత్మీయ భరోసాపైనా సందేహాలు

హాజీపూర్ మండలంలోని ఎనిమిది గ్రామాలు కార్పొరేషన్‌లో కలుస్తున్నాయి. దీంతో ఈ గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలు ఆ పథకానికి దూరం కానున్నారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ, ఏడాదికోసారి వంద రోజుల పని చేసుకునేకూలీలకు ఇకపై ఆ పనులు ఉండవని తెలిసి ఆందోళన చెందుతున్నారు. పట్టణ ప్రాంతంలో పూడికతీతలు, కందకాల తవ్వకం, చెట్లు నాటేందుకు గుంతలు తీయడం, ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణం ఇలాంటి పనులు అవసరముండదు. అందుకని ఉపాధి హామీని గ్రామీణ ప్రాంతాలకే వర్తింప చేస్తున్నారు. పట్టణ ప్రాంతాలకు దాన్ని విస్తరించాలనే నివేదికలు ఎప్పటి నుంచో ఉన్నా.. అది సాధ్యం కావడం లేదు. ప్రస్తుతం మంచిర్యాల మున్సిపాలిటీలోనూ ఉపాధి హామీ పథకం వర్తించడం లేదు. ఇదే తరహాలో ఇప్పుడు కార్పొరేషన్‌లో తమ గ్రామాలు విలీనమైతే 100 రోజుల పని కూడా ఉండదనే అంశంపై జనాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. గుడిపేటలో 352, ముల్కల్లలో 299, వేంపల్లిలో 350, నర్సింగాపూర్‌లో 253, నంనూర్‌లో 156 మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. వీరందరికీ ఇప్పుడు వంద రోజుల పని కూడా లేకుండా పోతుందనే భయం వెంటాడుతున్నది. పైగా కార్పొరేషన్‌లో కలిపితే ప్రస్తుతం సర్కార్ ప్రకటించిన ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందా.. లేదా.. అన్న విషయంపైనా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై అధికారుల నుంచి సైతం ఎలాంటి స్పష్టత రావడం లేదు. ఉపాధి కోల్పోవడంతో పాలు కార్పొరేషన్‌తో పన్నుల చెల్లింపు భారం పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కార్పొరేషన్‌లో కలిపితే బతికేదెట్లా

గతంలో మా ఊరిలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మించారని, మా భూములన్నీ ప్రాజెక్టులో కోల్పోయామని గుడిపేట వాసులు చెబుతున్నారు. ఆ ప్రాజెక్టుతో మాకు వచ్చిందేమీ లేదని, మా గ్రామంలో మెడికల్ కాలేజీ కడుతున్నారని, అందులోనూ మాకు ఉపాధి లేదని, అసలు ఉంటుందో లేదో కూడా తెలియదని వాపోతున్నారు. పక్కనున్న గ్రామాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేస్తూ, ఉపాధి హామీ పనులు చేస్తూ బతుకుతున్నామంటున్నారు. ఇప్పుడు కార్పొరేషన్‌లో కలిపితే బతికేదెట్లా అన్ని ప్రశ్నిస్తున్నారు. ఇంటి పన్ను, నల్లా పన్ను, చెత్త పన్ను ఇన్ని పన్నులు కట్టేందుకు మాకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయని మండిపడుతున్నారు. వ్యవసాయ పనులతో పాటు ఉపాధి పనులు చేసుకునే తమను ఇబ్బందులు పెట్టొందంటూ వేడుకుంటున్నారు. మాకు ఒక్క మాట కూడా చెప్పకుండా, మా అభిప్రాయం తీసుకోకుండా మా ఊరును కార్పొరేషన్‌లో కలిపే అధికారం ఎక్కడిదంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా తమ గ్రామాన్ని కార్పొరేషన్‌లో కలపొద్దని కోరుతున్నారు.

కార్పొరేషన్ వద్దు..

మాకు కార్పొరేషన్ వద్దు. మాకు భూములు, జాగలు ఏం లేవు. మేం కైకిలి చేసుకునేటోళ్లం. మా ఊరిలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పడ్డది.. దానితో మాకు ఎలాంటి ఉపాధి లేదు. ఇప్పుడు మెడికల్ కాలేజీ పడ్డది. దానితోనూ మాకు పనులు లేవు. ఇప్పుడు కార్పొరేషన్ అయ్యాక మాకు పనులు ఉంటాయనే నమ్మకం లేదు. ఓట్లప్పుడు ఇళ్లచుట్టూ తిరిగారు. ఇప్పుడు మా సమస్య గురించి ఎవరూ అడగడం లేదు. మాకు ఏ దిక్కూ లేదు. కార్పొరేషన్‌లో మా ఊరిని కలిపితే పన్నులు ఎట్లా కడుతాం. ఉన్న ఉపాధి పని కూడా పోయేలా ఉంది. అందుకే రాజకీయ నాయకులు దిగిరావాలి. మాకు న్యాయం చేయాలి. *- డోకె స్వరూప, గుడిపేట*

ఇందుకేనా గెలిపించింది

మా ఊరిని కార్పొరేషన్‌లో కలపడం వద్దు. మేం ఆరవై, డబ్బై మంది ఉపాధి కూలీలం ఉన్నాం. ఈ రోజు ర్యాలీగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చాం. మాకు ఎలాంటి భూములు, జాగలు లేవు. కూలీ చేసుకునేటోళ్లం. మా ఆయన చేపలు పట్టి గుడిపేటలో అమ్ముతాడు. నేను ఉపాధి పనికి పోత. ఇద్దరం కలిసి పనిచేస్తేనే కుటుంబం గడుస్తుంది. కార్పొరేషన్ అయితే గుడిపేట ఫిష్ మార్కెట్ కూడా మంచిర్యాలకు పోవాలి అంటున్నారు. అట్లా అయితే మా ఆయన ఫిష్ మార్కెట్‌కు పోవాల్సి వస్తుంది. నా 100 రోజుల పనిపోతుంది. ఇలా అయితే మేము ఎట్లా బతకడం. ఓట్లేసి గెలిపించినందుకు ఇలా గోస పెడుతరు అనుకోలే. *- డోకె సంధ్యారాణి, గుడిపేట*

ఇలా అయితే బతకడమెట్లా?

మా గ్రామాన్ని కార్పొరేషన్ చేస్తున్నారు. ఇది వరకే ప్రాజెక్ట్ పడి మా భూములన్నీ ముంపులో పోయాయి. మాకు ఇప్పుడు భూములు లేవు. మేమందరం కూలీ పనులు చేసుకునేటోళ్లమే. అక్కడ భూములున్నప్పుడు పోయి కూలీ పనులు చేసుకొని బతికినం. ఇప్పుడు అవి లేవు. మా ఆయన ఆటో నడుపుతడు. ఫ్రీ బస్సుతో గిరాకీలు లేకుంట అయినయి. ఇప్పుడు నేను చేసే ఉపాధి పనులు కూడా తీసేస్తే మేం ఎట్లా బతుకుతాం. కార్పొరేషన్ కలిపి ఇంటి పన్నులు, నల్ల పన్నులు, చెత్త బిల్లులు కట్టాలంటే ఎట్లా.. *- సంగం సరిత, గుడిపేట*

తెల్లబంగారం బుగ్గిపాలు!

- జిన్నింగ్ మిల్లుల్లో వరుస అగ్ని ప్రమాదాలు
- 20 రోజుల్లో మూడు చోట్ల ఘటనలు
- సుమారు రూ. 23 లక్షల దాకా నష్టం
- అప్రమత్తంగా లేకపోవడమే కారణమా..!

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో వరుస అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటుండగా, తెల్లబంగారం బుగ్గిపాలవుతున్నది. నిర్వాహకుల నిర్లక్ష్యమో.. అధికారులు అప్రమత్తంగా లేకపోవడమో తెలియదుగాని ఈ 20 రోజుల్లో మూడుచోట్ల ఘటనలు జరిగి రూ. 23 లక్షల దాకా నష్టపోవాల్సి వచ్చింది.

20 రోజుల్లో

ఆసిఫాబాద్ జిల్లాలో 17 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. 20 రోజుల్లో మూడుచోట్ల అగ్ని ప్రమాదాలు జరిగాయి. పత్తి నిల్వలతో వచ్చిన వాహనాల సైలెన్సర్లు వేడెక్కి వాటి నుంచి వచ్చిన నిప్పురవ్వలే ప్రమాదాలకు కారణమయ్యాయి. ఈ నెల 9న వాంకిడిలోని జిన్నింగ్ మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదంలో 10 క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. సుమారు రూ. లక్ష వరకు నష్టం జరిగింది. మంటలు చెలరేగిన వెంటనే అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అలాగే 20న జైనూర్‌లోని జిన్నింగ్ మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు 200 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. సుమారు రూ. 20 లక్షల వరకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. ఇక ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో మంటలు చెలరేగి సుమారు 30 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. సుమారు 30 క్వింటాళ్ల పత్తి కాలిపోయినట్లు తెలుస్తుండగా, సుమారు రూ. 2 లక్షల వరకు నష్టం వచ్చినట్లు అంచనా.

ఈ నెల 20న జైనూర్‌లోని జిన్నింగ్ మిల్లులో చెలరేగిన మంటలు

అప్రమత్తంగా లేకపోవడమే కారణమా..!

రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేసే జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు, అధికారులు అప్రమత్తంగా ఉండడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పత్తి నిల్వ ఉంచే చోట చిన్న నిప్పురవ్వ పడినా భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంటుంది. పత్తి కొనుగోళ్లు ప్రారంభించే సమయంలోనే ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను అధికారులు విధిగా పరిశీలించాల్సి ఉంటుంది. జిన్నింగ్ మిల్లులో ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే పత్తి కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలి.

అగ్నిమాపక కేంద్రాల సేవలు అంతంత మాత్రమే..

అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అగ్ని మాపక కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల జైనూర్‌లోని జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం జరగగా, అగ్ని మాపక యంత్రం అక్కడికి చేరుకునేలోపే భారీ నష్టం జరిగింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి జైనూర్ మండల కేంద్రం దాదాపు 55 కిలోమీటర్ల వరకు ఉంటుంది. అగ్నిమాపక వాహనం వెళ్లడానికి కనీసం గంట సమయమైనా పడుతుంది. అగ్నిమాపక యంత్రం అక్కడి చేరుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే అనుమతిస్తాం

జిన్నింగ్‌లలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే పత్తి కొనుగోళ్లకు అనుమతి ఇస్తాం. అన్ని జిన్నింగ్‌లలో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూనే పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి పత్తి అమ్మేందుకు తీసుకువచ్చే వాహనాల కండిషన్ బాగా లేకపోవడం, సైలెన్సర్‌కు తడిపిన గోనెసంచి కట్టిన తర్వాతే మిల్లులోకి వాహనాలు రావాలి. ఒక్కోసారి ఇలాంటి నిబంధన పాటించకపోవడం వల్లే అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. సైలెన్సర వేడితో పాటు వాహనాలు స్టార్ట్ చేసేటప్పుడు కూడా నిప్పు రవ్వలు పడే అకాశం ఉంటుంది. జిల్లాలో ఇప్పటి వరకు జిన్నింగ్‌లలో జరిగిన అగ్ని ప్రమాదాలు అలాంటివే. ఒక్కోసారి మిషనరీలో కలిగే సాంకేతిక లోపాల వల్ల కూడా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. జిన్నింగ్‌లలో పత్తి నిల్వలు ఉండే చోట అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నీళ్లు అందుబాటులో ఉంచుతున్నాం. *- పన్నాలాల్, సీసీఐ సీపీవో*

ఈనెల 9న వాంకిడిలోని జిన్నింగ్ మిల్లులో కాలిపోతున్న పత్తి

ఈ నెల 30న ఆసిఫాబాద్‌లోని జిన్నింగ్ మిల్లులో కాలిపోతున్న పత్తి

కమిషనర్లుగా బాధ్యతల స్వీకరణ

మంచిర్యాలటౌన్, జనవరి 31 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా తొటం శివాజీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2019 గ్రూప్-2 అధికారి అయిన ఆయన ఇప్పటి వరకు సెక్రేటేరియట్‌లో ఏఎస్‌వోగా పనిచేశారు. తాజాగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన మారుతీ ప్రసాద్ లక్షెట్టిపేట మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన శివాజీని డీఈ మసూద్, ఏఈ రాజేందర్, ఏవో అనితాదేవి, ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ విజయ్‌కుమార్, నస్పూరు కమిషనర్‌గా పనిచేసిన సతీష్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

మందమర్రిలో..

మందమర్రి, జనవరి 31 : మందమర్రి మున్సిపాలిటీ కమిషనర్‌గా తుంగపిండి రాజలింగు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం నగర పాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన రాజలింగు మందమర్రి మున్సిపాలిటీకి బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. నూతన కమిషనర్ రాజలింగును మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. డీఈ సుమతి, ఏఈఈ ఎస్.సందీప్, ఆర్ఐ కృష్ణప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, సిబ్బంది ఏ.రాణి, లక్ష్మీ రాజు, బంగారు శ్రీనివాస్, రాజేందర్, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు కొంగల తిరుపతి రెడ్డి, బోరిగం వెంకటేశ్, దుర్గం ప్రభాకర్, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, మంద తిరుమల్ రెడ్డి, అవునూరి పోషం, సాదుల విద్యాసాగర్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన శివాజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఈ, ఏఈ, ఏవో, సిబ్బంది

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజలింగును సన్మానిస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

ఉద్యోగ విరమణ అనివార్యం

- శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి
- ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 31 : ఉద్యోగ విరమణ అనివార్యమని, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్ఐ సుధాకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ సంఘం ఆధ్వర్యంలో ఎస్ఐ సుధాకర్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఎస్పీ సుధాకర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణాప్రతాప్, ఆర్ఐ అంజన్న, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ శేఖర్, డీపీవో ఏవో శ్రీనివాస్ రెడ్డి, సీసీ కిరణ్, సూపరింటెండెంట్, ఆర్.ఎస్ఐ ఓదెలు, పోలీస్ సంఘం వైస్ ప్రెసిడెంట్ స్వామి, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఎస్ఐ సుధాకర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐని శాలువాతో సత్కరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస రావు